


## స్పీడందుకున్న గేమ్‌చేంజర్

మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'గేమ్‌చేంజర్'. దాదాపు రెండున్నరేళ్లుగా ఈ సినిమా షూటింగ్ జరుగుతూనేవుంది. శంకర్ 'భారతీయుడు' ఫ్రాంచైజీతో బిజీ కావడమే ఈ జాప్యానికి కారణం. అయితే, ఎట్టకేలకు ఈ సినిమా నిర్మాణంలో వేగం పెంచారు దర్శకుడు శంకర్. సునీల్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆయన నేపథ్యంలోసాగే సన్నివేశాలను చిత్రీకరించారు. తదుపరి షెడ్యూల్ ఈ నెలాఖరు నుంచి షురూ చేశారు. రామ్‌చరణ్ లేని సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో పూర్తి చేస్తారని సమాచారం. దీనికోసం సెకండ్ యూనిట్‌ను నియమించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ, అంజలి కథానాయికలు. శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, నరేశ్, సముద్రఖని, నాజర్, ప్రియదర్శి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాత: దిల్‌రాజు.

## బంద్ వ్యక్తిగత నిర్ణయం



కొత్త చిత్రాల రిలీజ్‌లు లేకపోవడం, ఆక్యుపెన్సీ తగ్గిపోవడంతో తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో ప్రదర్శనలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. పదిరోజుల పాటు థియేటర్లను మూసివేస్తున్నట్లు థియేటర్ల యాజమాన్యాలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో థియేటర్ల బంద్ ఎగ్జిబిటర్ల వ్యక్తిగత నిర్ణయమని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలోని అపెక్స్ బాడీస్ అయిన తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. 'ఈ విషయంలో థియేటర్ యాజమాన్యాలు అపెక్స్ బాడీకి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. అందుకే థియేటర్ల బంద్ ఫేక్ అని తెలియజేస్తున్నాం. ఈ విషయంలో అపెక్స్ బాడీకి ఎలాంటి సంబంధం లేదు' అని ప్రకటనలో పేర్కొన్నారు. థియేటర్ల బంద్ యాజమాన్యాల వ్యక్తిగత నిర్ణయమని, దీనిపై తెలంగాణ ఫిలిం ఛాంబర్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, సెక్రటరీ కె.అనుపమ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.



## అమ్మాయిలు చూడాల్సిన సినిమా

'సత్యభామ'గా నటించడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఇలాంటి కేరక్టర్ నా కెరీర్‌లో చేయడం తొలిసారి. ఈ సినిమాలో అన్ని ఎమోషన్సూ ఉన్నాయి. ఈ సినిమా అందరికీ నచ్చుతుందని నమ్మకంగా చెప్పగలను' అన్నారు కాజల్ అగర్వాల్. ఆమె ప్రధానపాత్ర పోషించిన 'సత్యభామ' చిత్రం మ్యూజికల్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'నేను బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత చేసిన సినిమా ఇది. చాలా పర్పస్‌ఫుల్ సబ్జెక్ట్. అమ్మాయిలు తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది. 'షీ సేఫ్' యాప్‌ను అమ్మాయిలు ఎలా ఉపయోగించాలో ఈ సినిమాలో చూపించాం. సత్యభామ శక్తి కండబలంతోపాటు బుద్ధిబలంలో కూడా ఉంటుంది. మహిళాశక్తికి అద్దం పట్టే సినిమా ఇది' అని తెలిపింది కాజల్. ఈ సందర్భంలోనే ఈ సినిమాలోని థర్డ్ సింగిల్ 'వెతుకు.. వెతుకు..' పాటను మేకర్స్ విడుదల చేశారు. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకుడు కాగా, బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కళపల్లి నిర్మాతలు. శశికిరణ్ తిక్క సమర్పకులు. ఈ చిత్రానికి సంగీతం శ్రీచరణ్ పాకాల.



## విజయ్ సినిమా కథ వెనుక కథ

విజయ్ దేవరకొండ చేయనున్న చిత్రాల్లో రాహుల్ సంకృత్యాన్ సినిమా ఒకటి. మైత్రీ మూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ట్యాక్సీవాలా, శ్యామ్‌సింగరాయ్ సినిమాలతో దర్శకుడిగా తనేంటో నిరూపించుకున్నారు రాహుల్ సంకృత్యాన్. విజయ్‌తో చేయనున్న సినిమాకి కూడా వైవిధ్యమైన కథనే ఎంచుకున్నారాయన. ఇది పీరియాడికల్ యాక్షన్ డ్రామా అని తెలుస్తున్నది. అయితే.. ఈ కథ విషయంలో ఆసక్తికరమైన విషయం ఒకటి వెలుగు చూసింది. రాహుల్ ఈ కథను విజయ్ కంటే ముందు తమిళ హీరో సూర్యకి వినిపించారు. సూర్య, కార్తీ తండ్రీకొడుకులుగా మల్టీస్టారర్ చేయాలనేది ఆయన ఆలోచన. వారికి కూడా ఈ కథ నచ్చింది. కానీ కొన్ని కారణాల వల్ల కథ పట్టాలెక్కలేదు. చివరకు ఆ కథ విజయ్ దేవరకొండ కోర్ట్‌లోకి వచ్చి పడింది. విజయ్ ఇమేజ్‌కి తగ్గట్టు కథలో కొన్ని మార్పులు కూడా జరిగాయని సమాచారం. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రెండు పాత్రలూ విజయే పోషించనున్నారు. కథానాయికగా రష్మిక ఖరారైంది. విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా ఇది.



## దివ్యవతి చనిపోయి దెయ్యం ఎలా అయ్యింది?

'ఇంతవరకు దర్శకులను పరిచయం చేసిన నేను, తొలిసారి నిర్మాతను పరిచయం చేస్తున్నాను. నాగ మల్లిడి మంచి అభిరుచిగల నిర్మాతగా ఎదుగుతాడు. ట్రైలర్ చూస్తే టీం కష్టం కనిపిస్తుంది. ఇది న్యూ ఏజ్ లవ్‌స్టోరీ. ఈ నెల 25న విడుదల కానున్న ఈ సినిమా పెద్ద హిట్ కావడం ఖాయం' అని నమ్మకం వ్యక్తంచేశారు అగ్రనిర్మాత దిల్‌రాజు. ఆశిష్, వైష్ణవిచైతన్య జంటగా రూపొందిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకుడు. హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మాతలు. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ- 'సీతమ్మ, సతీదేవి చనిపోయి దేవతలు అయితే.. దివ్యవతి చనిపోయి దెయ్యం ఎలా అయ్యింది? అనే ప్రశ్నకు సమాధానమే ఈ సినిమా. ఇందులో ఆశిష్ పాత్ర పేరు అర్జున్. ఆ పాత్రలో శివుడి రిఫరెన్సులు కనిపిస్తాయి. యుద్ధంకంటే ప్రేమించడానికి ఎక్కువ గట్స్ కావాలి. అలాంటి దెయ్యాన్ని ప్రేమించాలంటే ఇంకెంత గట్స్ ఉండాలి. ఆ పాత్రను ఆశిష్ ఎంతో ఇష్టంగా పోషించాడు. గంగాదేవి లాంటి పవిత్రమైన పాత్రను ఇందులో వైష్ణవి చైతన్య పోషించింది' అని తెలిపారు. ఇంకా చిత్రయూనిట్ అందరూ మాట్లాడారు.



## అలాంటి అబ్బాయి కావాలి

కథానాయికల ప్రేమ, పెళ్లి విషయాల గురించి అభిమానులకు చాలా ఆసక్తి ఉంటుంది. ముఖ్యంగా సదరు నాయిక ప్రేమలో ఉందంటే చాలు శుభవార్త ఎప్పుడు చెబుతుందో నని ఎదురుచూస్తుంటారు. ఇప్పుడు జాన్వీకపూర్ అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ షిండే మనవడు శిఖర్ పహారియాతో ఈ భామ ప్రేమలో ఉందని ప్రచారం జరుగుతున్నది. ఇటీవలే ఓ సినిమా ప్రీమియర్ షోకు హాజరైన జాన్వీకపూర్ 'శిఖు' అనే లోగో వున్న నెక్లెస్‌ను ధరించారు. దీంతో ఈ ఇద్దరి మధ్య బంధం నిజమేనని అభిమానులు అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్‌కు హాజరైన జాన్వీకపూర్ తనకు కాబోయే భర్త ఎలా ఉండాలో చెప్పుకొచ్చింది. 'ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా నాకు ధైర్యం చెప్పాలి. నా కలల సాకారానికి అండగా నిలవాలి. ఎప్పుడూ నన్ను సంతోషంగా ఉంచాలి. అలాంటి వ్యక్తినే నేను పెళ్లాడతా' అని చెప్పుకొచ్చింది. శిఖర్ పహారియాతో రిలేషన్‌షిప్ గురించి అడగ్గా సమాధానాన్ని దాటవేసింది. క్రికెట్ నేపథ్య కథాంశంతో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ నెల 31న విడుదల కానుంది.

## మర్డర్ మిస్టరీ నేపథ్యంలో



వరుణ్‌సందేశ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'నింద'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రాజేష్ జగన్నాథం తెరకెక్కించారు. కాండ్రకోట అనే ప్రదేశంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్ర టీజర్‌ను నవీన్‌చంద్ర విడుదల చేశారు. 'జీవితంలో కొన్నిసార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు' అనే సంభాషణతో మొదలైన టీజర్ ఎన్నో మలుపులతో ఆకట్టుకుంది. ప్రేమకథతో పాటు మర్డర్, క్రైమ్, మిస్టరీ అంశాలతో ఉత్కంఠను పంచింది. విజువల్స్ మెప్పించాయి. కాండ్రకోటలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో మిస్టరీ థ్రిల్లర్‌గా మెప్పిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. అనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్యకుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రమీజ్ నవీత్, సంగీతం: సంతు ఓంకార్, రచన-దర్శకత్వం: రాజేష్ జగన్నాథం.

## ప్రముఖ నిర్మాత చేతికి రాజు యాదవ్



గెటప్‌శ్రీను హీరోగా అరంగేట్రం చేస్తున్న చిత్రం 'రాజు యాదవ్'. కె.కృష్ణమాచారి దర్శకుడు. కె.ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మాతలు. ఈ నెల 24న సినిమా విడుదల కానుంది. ఏపీ, తెలంగాణలో ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు నిర్మాతలు తెలియజేశారు. ప్రేమ, కామెడీతో పాటు మనసుల్ని హత్తుకునే భావోద్వేగాలతో కూడిన కథతో రూపొందిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని, హర్షవర్దన్ రామేశ్వర్ స్వరాలు ఇప్పటికే మంచి ఆదరణ పొందుతున్నాయని సినిమా కూడా మంచి విజయం సాధిస్తుందని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. అంకిత ఖరత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆనంద చక్రపాణి, రాకెట్ రాఘవ, మిర్చి హేమంత్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్.

## సందేశాత్మక కథతో 'ప్రేమించొద్దు'



అనురూప్ రెడ్డి, దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ప్రేమించొద్దు'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో శిరిన్ శ్రీరామ్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో విడుదలకానుంది. తెలుగులో జూన్ 7న రిలీజ్ చేస్తున్నారు. గురువారం టీజర్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు శిరిన్ శ్రీరామ్ మాట్లాడుతూ 'బస్తీ నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది. ప్రతి పాత్ర సహజంగా అనిపిస్తుంది. నిజ జీవితాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. తల్లిదండ్రులు పిల్లలకు చూపించాల్సిన సినిమా. సందేశాత్మక కథతో ఆకట్టుకుంటుంది' అన్నారు. ప్రతీ సన్నివేశం రియలిస్టిక్‌గా ఉంటుందని హీరో అనురూప్‌రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: హర్ష కొడాలి, సంగీతం జునైద్ కుమార్, రచన, ఎడిటింగ్, నిర్మాత, దర్శకత్వం: శిరిన్ శ్రీరామ్.



## వారికోసమైనా వెళ్లాలి..

కొన్నేళ్లుగా ప్రతి కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఐశ్వర్యరాయ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూనే ఉన్నది. అసలు ఆ వేడుకకు కళే ఆమె అనే వాళ్లు కూడా లేకపోలేదు. ఈ ఏడాది కేన్స్ వేడుక రానే వచ్చింది. మరి ఐశ్వర్య ఈ దఫా ఏ లుక్‌లో కనిపిస్తారు? రెడ్ కార్పెట్‌పై ఎలా నడుస్తారు? అనే ఆరాటం లక్షలాది అభిమానుల్లో నెలకొని ఉండటం కామనే. ఆనవాయితీ ప్రకారం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి ఐశ్వర్య బయలుదేరింది. ఈ సారి తనతో పాటు కుమార్తె ఆరాధ్య కూడా కేన్స్‌లో ప్రత్యేక ఆకర్షణ కానున్నది. వీరిద్దరూ ముంబయ్ ఎయిర్‌పోర్ట్‌లో కేన్స్‌కు వెళుతూ కెమెరాలకు చిక్కారు. అయితే.. ఐశ్వర్యరాయ్ కుడిచేతికి కట్టుతో కనిపించింది. ఊహించని ఈ పరిణామాన్ని చూసి ఆమె అభిమానులు షాక్ అయ్యారు. ఈ గాయంతో కేన్స్ రెడ్‌కార్పెట్‌పై ఐశ్వర్య ఎలా నడుస్తుంది అంటూ సందేహం వ్యక్తం చేస్తున్నారు. అంతగాయంలో కూడా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి సిద్ధమైన ఆమె నిబద్ధతను కొందరు కొనియాడుతున్నారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ 'నాకోసం ఎదురు చూసే లక్షలాది అభిమానులకోసమైనా వెళ్లాలి. అలాగే నేను కనిపించగానే కెమెరాలతో క్లిక్‌మనిపించడానికి వందలాది ఫొటోగ్రాఫర్లు నాకోసం అక్కడ ఎదురు చూస్తుంటారు. వారికోసమైనా వెళ్లాలి' అంటూ అందంగా నవ్వేశారు ఐష్. ఈ నెల 25వరకూ కొనసాగే ఈ వేడుకల్లో ఐశ్వర్యరాయ్ తోపాటు ఊర్వశీ రౌతేలా, అదితిరావు హైదరీ, శోభితా ధూళిపాళ, కియరా అద్వానీ కూడా పాల్గొనబోతున్నారు.



## రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'సిల్క్ శారీ'

వాసుదేవ్ రావు, రీవా చౌదరి, ప్రీతీ గోస్వామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సిల్క్ శారీ'. టి.నాగేందర్ దర్శకుడు. కమలేష్ కుమార్, రాహుల్ అగర్వాల్ హరీష్ చండక్ నిర్మాతలు. శుక్రవారం ఈ సినిమాలోని 'చేతులోని స్కాచ్ గ్లాస్' అనే ఫస్ట్ లిరికల్ సాంగ్‌ను దర్శకుడు సాయిరాజేష్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. యథార్థ సంఘటనల ఆధారంగా వినూత్నమైన కథతో తెరకెక్కించాం. టైటిల్ బాగుందని ప్రశంసలొస్తున్నాయి. తప్పకుండా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది' అన్నారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కించిన ప్రేమ కథా చిత్రమిదని హీరో వాసుదేవ్ రావు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సనక రాజశేఖర్, సంగీతం: వరికుప్పల యాదగిరి, దర్శకత్వం: టి.నాగేందర్.